క్లుప్తంగా

నియామకం


బాబూరావుకు నియామకపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్ రాజు

మధిర: భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ మధిర నియోజకవర్గ అధ్యక్షుడిగా మోలుగుమాడు గ్రామానికి చెందిన జిల్లేపల్లి బాబూరావును నియమించారు. ఈ సందర్భంగా ఆయనను మధిరలో ఆదివారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అభినందించారు. బాబురావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి రావడానికి కృషి చేసిన జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా మధిరలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ వల్లపోతు ప్రసాద్ రావును కూడా అభినందించారు.

ఎమ్మెల్యేకు వినతి

వైరా: తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు సెర్ప్ ఉద్యోగుల మాదిరి పేస్కేలు అమలు చేసి ఆదుకోవాలని వైరా మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆదివారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైరా మండల అధ్యక్షుడు కె.రవిబాబు, ప్రధాన కార్యదర్శి టి.రవికుమార్, మహిళా అధ్యక్షురాలు కె.సైదమ్మలు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు గత 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిని తక్షణమే క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు డీఎస్ఎన్, నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామంలో శ్రీఅంకమ్మ – మహాలక్ష్మమ్మ తల్లుల జాతర సందర్భంగా ఆదివారం జూనియర్, సీనియర్ విభాగాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను స్థానిక ఎస్సై సురేష్, సర్పంచ్ వెంకటరెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

సత్తుపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఎస్‌పీ పార్టీ కోఆర్డినేటర్ గోళ్లమూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి.. గద్దెనెక్కిన తరువాత వర్గీకరణ ఊసే ఎత్తకుండా దళితులను మోసం చేస్తున్నాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం మొండి వైఖరి చూపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 4న హైద్రాబాద్, విజయవాడ జాతీయ రహదారుల దిగ్బంధానికి మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ, తాళ్ల అర్జున్, అశోక్, మారేష్, రాఘవ, దేవన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు రాంబాబు, మరియమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తిరుపతి కిషోర్

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ జాన్సీ, వైస్ ఎంపీపీ హనుమంతురావు, ఉపసర్పంచ్ సైదేశ్వరరావు, గ్రామపెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఏన్కూరు/పెనుబల్లి: ఏన్కూరులోని స్థానిక గురుకుల విద్యాలయంలోని 76 మంది విద్యార్థులకు వైరా టీపీసీసీ సభ్యుడు రామ్మూర్తి నాయక్, పెనుబల్లిలోని అడవి మల్లెల గురుకుల పాఠశాలలోని 80 మంది పదో తరగతి విద్యార్థులకు అర్ష డెవలప్‌మెంట్ ప్రొప్రైటర్ కొండా సురేష్ ఆదివారం పరీక్షప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలల్లో తిమ్మారావుపేట ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ నాయకుడు ఆనందప్రసాద్, నర్సింహారావు, గురుకుల విద్యాలయం చైర్మన్ అంజన్‌రాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీసాగు

- మొత్తం 19,487 ఎకరాల్లో వరిసాగు
- అదుపులో తెగుళ్లు, చీడపీడలు
- పది రోజుల్లో ప్రారంభం కానున్న వరికోతలు
- దిగుబడిపై రైతుల ఆశలు

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపైరు అవాంతరాలెదురైనా ఆశాజనకంగా ఉంది. తెగుళ్లు, చీడ పీడలు రబీలో అంతగా ప్రభావం పడకుండానే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. వాతావరణం అనుకూలించటంతో ఈ ఏడాది దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


బిల్లుపాడు గ్రామంలో సాగు చేసిన వరిపంట

తల్లాడ: తల్లాడ మండలంలో రబీ సీజన్‌లో 19,487 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఎన్నెస్పీ కింద 13,487 ఎకరాలు, లిఫ్టులు, చెరువులు, కుంటలు, వైరా రిజర్వాయర్ కింద 6 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేశారు. గత జనవరి నెలలో 1061 రకం వరిని సాగు చేశారు. ప్రస్తుతం గింజ పాలు పోసుకొనే దశలో ఉంది. మరో పది రోజుల్లో వరి కోతలకు సిద్ధం కానుంది. మండల వ్యాప్తంగా వరి పైరు ఏపుగా పెరిగి కళ కళలాడుతోంది.

సాగర్ ఆయకట్టు చివరి భూములకు సైతం నీరు ..

ఈ ఏడాది నాగార్జున సాగర్ కాల్వల కింద ఉన్న చివరి భూములకు నీరందక వరి ఎండిపోయే పరిస్థితి మార్చి మొదటి వారంలో ఎదురైంది. దీంతో రైతుల ఆందోళన చేపట్టడంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జోక్యంతో మార్చి 12న జలవనరులశాఖ ఇరిగేషన్ ఇన్ చీఫ్ నాగేందర్‌రావు, ఉన్నతాధికారులు సిరిపురంతో పాటు కల్లూరు, పెనుబల్లి మండలాల పరిధిలోని మైనర్లు, సబ్‌మైనర్ కాలువల కింద నెర్రలు బాచిన పొలాలను పరిశీలించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించడంతో వారు చివరి భూములకు నిరందేలా నీటిని విడుదల చేశారు.

అనుకూలించిన వర్షం.. తగ్గిన చీడపీడలు

సాగు చేసిన వరి పైరుకు మార్చి నెలలో రెండు సార్లు కురిసిన వర్షాలకు సరిగ్గా నీరందక నెర్రెలిచ్చిన భూమికి వరంలా మారింది. దీంతో పాటు సాగర్ నీటి సరఫరా కూడా సవ్యంగా ఉండటంతో వరి రైతులు గట్టెక్కినట్లైంది. అంతే కాకుండా చీడపీడలు కూడా పెద్దగా ఆశించలేదు. అక్కడక్కడా అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించనప్పటికీ వ్యవసాయాధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో సర్దు మనిగింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే.. కొనుగోళ్లు

రబీలో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. మరో పది రోజుల్లో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీసీఎంఎస్, సొసైటీ, ఐకేపీ అధికారులు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్లో మండంలో 20 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేయగా 19 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 27 గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఎట్టకేలకు మరికొద్ది రోజుల్లో ధాన్యం చేతికొచ్చే సమయం ఆసన్నమైంది.

చీడ పీడలు తక్కువే..



మండలంలో రబీలో సాగు చేసిన వరి పంటల్లో చీడపీడలు తక్కువగానే ఉన్నాయి. అగ్గితెగులు, మెడ విరుపు తెగులు, కాండం తొలుచు పురుగు 20 శాతం వరి పైరుకు మాత్రమే ఆశించిందనీ, అది కూడా కంట్రోల్ అయ్యేందుకు రైతులకు తగు, సూచనలు, సలహాలు ఇచ్చాము. ఈ ఏడాది మండల వ్యాప్తంగా రబీ వరి సాగు ఆశాజనకంగానే ఉంది.
– ఎండి.తాజుద్దీన్, ఏఓ, తల్లాడ

నీటి సమస్య నుంచి గట్టెక్కాం..



ప్రారంభంలోనే వరిసాగుకు నీటి సమస్య ఏర్పడింది. దీంతో పొలాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జోక్యంతో ఉన్నతాధికారులు వరి పైరును పరిశీలించి సిబ్బందికి తెలపారు. దీంతో కాలువ చివరివరకు నీటిని విడుదలచేశారు. దీంతో నీటి సమస్య నుంచి గట్టెక్కాం.
– ఇంజం సత్యనారాయణ, రైతు, రేజర్ల

సీతారాములకు పుష్పాభిషేకం


వైరారూరల్: సీతారాములకు పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారాములకు పుష్పాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రాములోరికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్ మహ్మద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య పర్యవేక్షణలో శ్రీసీతారామచంద్ర ప్రభు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం శనివారం రాత్రి 11 గంటలకు జరిగింది. స్వామి వారికి ఉదయమే ఆరాధన పూర్తయ్యాక 10 గంటలకు మహా పూర్ణాహుతి, తదుపరి స్వామివారికి 108 కలశాలతో అభిషేకం, వేంకటేశ్వరస్వామి కల్యాణం, రాత్రి సామూహిక భగవద్గీత పారాయణం, పుష్పయాగం జరిగాయి. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్య పలుకూరి తిరుమలాచార్య, సీతారామానుజాచార్యులు, శేషాచార్యులు, కృష్ణచైతన్య, బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, ఒగ్గు పుల్లారెడ్డి, నర్సింహారెడ్డి, చింతల సురేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు సర్వాయి పాపన్న

వైరా /సత్తుపల్లిటౌన్/ముదిగొండ: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక విప్లవ వీరుడు, ఆదర్శవంతుడని రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బోర్రా రాజశేఖర్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. ఆదివారం సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ్ సంఘం ఆధ్వర్యంలో వైరాలో, సత్తుపల్లిలోని స్థానిక రింగ్ సెంటర్‌లో, ముదిగొండలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వాయి పాపన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలల్లో వైరా సీఐ టి.సురేష్, ఆదినారాయణ, వాసు, సైదులు, రవి, గోవిందరావు, సుబ్బారావు, ధర్మారావు, పిచ్చయ్య, సురేష్, సత్తుపల్లి పట్టణ గౌడ్ సంఘం అధ్యక్షుడు రామకృష్ణగౌడ్, వెంకటేశ్వరరావు గౌడ్, కృష్ణారావు గౌడ్, నాగేశ్వరరావు, మాధవరావు, రామకృష్ణ, అప్పారావు, జెడ్పీటీసీ సభ్యురాలు దుర్గ, వైస్ ఎంపీపీ దామోదర్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లిటౌన్: సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఈ నెల 5న ఢిల్లీలో జరగనున్న చలో ఢిల్లీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్యాణం వెంకటేశ్వరరావు, కోటి సుబ్బారెడ్డి, సగ్గుర్తి సంజీవరావు, అంగోతు వెంకటేశ్వర్లు, నాగులవంచ వెంకట్రామయ్య, తదితరులు ఉన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

ఏన్కూరు: మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు ఆరెం రామయ్య కోరారు. మండలంలోని తూతకలింగన్నపేటలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. బీపీ, షుగర్‌తో బాధపడేవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అర్హులైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. 100మందికి వైద్యపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు ఆకెన పవన్, అమర్‌నాథ్, యంగల గిరి, గోపి, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెనుబల్లి : మండలంలోని ఏరుగట్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు ఆవశ్యకతను వివరించారు. అనంతరం బరువు ఎక్కువగా ఉన్న చిన్నారులకు బహుమతులు అందించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అలేఖ్య, సర్పంచ్ శ్యామలా దేవి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మెహరున్నీషాబేగం, సూపర్‌వైజర్ లక్ష్మీకాంతమ్మ, టీచర్ సుశీల, రాఘవమ్మ, ఆయాలు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆదినారాయణ, ఏఎన్ఎం ఎండీ ఇషాంత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న మానవతారాయ్

సత్తుపల్లి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ సత్తుపల్లి జామే మసీద్‌లో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, ఎండీ ఫజల్‌బాబా, రామిశెట్టి సుబ్బారావు, ఐ.కృష్ణ, ఎస్‌కే ఖలీల్, ఎస్‌కే బాజీ, ఎండి సమ్మద్, కంభంపాటి కాంతయ్య, రాజబోయిన ప్రసాద్, ఎండీ మహ్మద్ పాషా, ఉమామహేశ్వరచారి పాల్గొన్నారు.

ఆభరణాల దుకాణాన్ని ప్రారంభించిన నామా

ముదిగొండ: ముదిగొండలో ఆదివారం ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు శ్రీబాలాజీ జ్యూయలరీ షాపును ప్రారంభించారు. ముదిగొండ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బంగారు దుకాణాన్ని ఆయన ప్రారంభించి రూ.10 వేలు విలువైన వెండి వస్తువులు కొనుగోలు చేసి స్థానిక సర్పంచ్ మందరపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ, మరో కార్యకర్తకు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు వెంకట్, శ్రీనివాస్ యాదవ్, వెంకన్న, ప్రసాద్, లక్ష్మారెడ్డి, వెంకట్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సత్తుపల్లిటౌన్: ఎన్‌సీసీ జిల్లా లీగల్ వింగ్ అధ్యక్షుడు, అడ్వకేట్ తేళ్లూరి ఆడమ్స్‌ను ఆదివారం ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆధ్వర్యంలో పాస్టర్లందరూ ఆయన ఇంటి వద్ద కలిసి కుటుంబం కోసం ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 8న జరిగే రస్ఫర్ జీసెస్ కార్యక్రమాల ఖర్చులకు గాను రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ నియోజకవర్గ అధ్యక్షుడు జాన్‌మార్క్, రాష్ట్ర నాయకుడు వరప్రసాద్, జిల్లా నాయకుడు ప్రభాకర్, దేవసహాయం, ప్రభాకర్, సుధాకర్, కుమారాజా, జయరాజు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాంబశివరావు

సత్తుపల్లిటౌన్: స్వర్గీయ తుళూరు ప్రసాద్ పేరు మీద ఆయన శిష్యులు, అభిమానులచే పట్టణంలోని సిద్ధారంరోడ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ ప్రముఖులు చలసాని సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, వినుకొండ కృష్ణ, ఫయాజ్, ప్రసాద్, రంగారావు, ద్రోణవల్లి గోపి, రఘు, కిట్టు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాలు

- జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి
- జమలాపురంలో ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఎర్రుపాలెం: తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శవంతమవుతున్నాయని, అందుకే కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూధన్‌లు అన్నారు. ఆదివారం జమలాపురం గ్రామంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమన్నారు. మధిరలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ నిష్పక్షపాతంగా సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ సారి ఎలాగైనా బీఆర్ఎస్ ఎమ్మెల్యేని గెలుపించుకోవాలన్నారు. కేంద్రం తెలంగాణాపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.10వేలు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ అసమ్మతి నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తాతా మధు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొంగులేటి చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టే బాధ్యత ప్రతీ ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తున్నా.. మధిర ఎమ్మెల్యే గెలుపు విషయంలో ఎందుకు తప్పు జరుగుతుందో ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రామ్మూర్తి, చావా రామకృష్ణ, ఎంపీపీ శిరీష, మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, రైతుసమితి మండల అధ్యక్షుడు బాలరాఘవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి చోటు లేదు


సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, ఎంపీ నాగేశ్వరరావు

వైరా: తెలంగాణలో బీజేపీకి చోటు లేదని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. వైరా వాసవీ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిధులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ.. తెలంగాణ పంచాయతీలకు కేంద్రం అవార్డులు ఇస్తుంది కానీ మెడికల్ కళాశాలలు, రేల్వే కోచ్ ఫ్యాక్టరీని మాత్రం ఇవ్వడంలో వివక్ష చూపుతున్నదన్నారు. తెలంగాణ పై పన్నులు వేస్తున్నారు కానీ నిధులు మంజూరు చేయడం లేదన్నారు. తెలంగాణాపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదే అని అన్నారు. పార్టీలో క్రమశిక్షణ తప్పిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, కౌన్సిలర్లు డేడీ కుమారి, డాక్టర్ కోటయ్య, నాగేశ్వరరావు, వేణు, రామారావు, సక్కుబాయి, సునీత, కృష్ణార్జునరావు, బీడీకే రత్నం, పవిత్రకుమారి, డాక్టర్ మురళీ కృష్ణ, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమ్మేళనాలను జయప్రదం చేయండి

6న తిమ్మారావుపేటలో ఆత్మీయ సమ్మేళనం

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేటలో ఈ నెల 6న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సురేష్‌నాయక్ తెలిపారు. ఆదివారం తిమ్మారావుపేట రైతువేదికలో బీఆర్ఎస్ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు మోత్కూరి కోటయ్య కల్యాణమండపంలో సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఈ సమ్మేళనానికి పార్టీ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. నాయకులు ధర్మారావు, సుహాసిని, కాంతి, క్రిష్ణప్రియ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

3న మాణిక్యారంలో..

కారేపల్లి: ఈ నెల 3న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని మాణిక్యారం గ్రామంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళ కార్యక్రమానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలని ఇంటింటికీ తిరుగుతూ ఆదివారం బొట్టు పెట్టి ఆహ్వానించారు. మాణిక్యారం ఎంపీటీసీ శివరాత్రి పర్వతి, సర్పంచులు రంగారావు, సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉమాశంకర్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, వీరన్న, పుల్లారావు, బద్దులాల్ పాల్గొన్నారు.


కారేపల్లి: ఆత్మీయ సమ్మేళనానికి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న కార్యకర్తలు

ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు: మండలంలోని భీరపల్లి సత్తెమ్మ గుడి వద్ద సోమవారం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ.. పలు పంచాయతీలలో ఇంటింటికీ వెళ్ళి ఆహ్వాన పత్రాలు అందిస్తూ ప్రతి ఒక్కరు ఆత్మీయ సమ్మేళనానికి రావాలన్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర వ్యవసాయ శాక మంత్రి నిరంజన్ రెడ్డితో పాటు ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిధుగా హాజరవుతారని తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం


మధిర: మాట్లాడుతున్న పాస్టర్ ఏసుపాదం


వైరా: దివ్యబలి పూజ సమర్పిస్తున్న చర్చి ఫాదర్లు


తల్లాడలో మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఫాదర్లు, క్రైస్తవులు

మధిర: పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీ బైబిల్ మిషన్ కాకాని తోట వారి మరనాత మహిమ మందిరంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. ఏసు ప్రభువును తలచుకుంటూ, పాటలు పాడుతూ ఏసు సిలువతో పుర వీధుల్లో తిరిగారు. కార్యక్రమంలో పాస్టర్ ఏసుపాదం, క్రైస్తవులు పాల్గొన్నారు.


వైరా: వైరాలో సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో ప్రత్యేక దివ్యబలి పూజలు సమర్పించారు.

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట జోజప్ప చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం క్రైస్తవ సోదరులు, చర్చిఫాదర్లు మట్టలు పట్టుకొని చర్చి నుంచి ప్రధాన సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు మదాన్ ఆరోగ్య, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో లూర్దుమాతా విచారణ గురువులు సురేష్ జోష్, ఫాదర్ క్రీస్తుబాబు, మూకర ప్రసాద్, కర్నాటిలక్ష్మారెడ్డి, మూకర చార్లెస్, జయరాజు, బత్తుల వెంకటేశ్వర్లు, లూర్ధు, ప్రతాప్ పాల్గొన్నారు.

కొణిజర్ల: కొణిజర్లలో ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చీ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరంపల్లి రామారావు పాదయాత్రలో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్లూరు: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ చర్చ్ విచారణ గురువులు రెవ.ఫాదర్ విన్సెంట్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. కప్పల బంధం రోడ్‌లో ఉన్న క్రీస్తురాజు మందిరం నుంచి అంబేద్కర్ నగర్ జాతీయ రహదారి మీదుగా లిటిల్ ఫ్లవర్ చర్చి వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రెవ.ఫాదర్ లూర్దు, విచారణ సహాయ గురువులు దేవాదానం, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.


కొణిజర్లలో..


ఏన్కూరు: ప్రదర్శనలో ఫాదర్లు, క్రైస్తవులు


కల్లూరులో..